క్లుప్తంగా

స్వచ్ఛంద సేవకుడికి సన్మానం



దేవరకద్ర: ప్రముఖ స్వచ్ఛంద సేవకుడు ఉస్కిల్ల వెంకట్రాములుకు ఇటీవలే డాక్టరేట్ వచ్చిన సందర్భంగా గురువారం మున్సిపాలిటీ కార్యాలయం వద్ద ఆయనను పలువురు అధికారులు, నాయకులు ఘనంగా సన్మానించారు. పదేళ్లుగా స్వచ్ఛంద సేవలందించడంతో పాటు రాజకీయంగా చేసిన సేవలకు గుర్తింపుగా ఇటీవల తమిళనాడులోని ఊటీలో ఉన్న గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ వారు వెంకట్రాములుకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్, దేవరకద్ర మున్సిపల్ కమిషనర్లు మహేశ్వర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, మేనేజర్ సీత్యానాయక్, నాయకులు ఆదిహన్మంతరెడ్డి, రాంపాండు, అంజన్‌కుమార్‌రెడ్డి, నర్వ శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహారెడ్డి, జవహర్, శ్రీనివాసులు, జగన్నాథరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, చంద్రమౌళి, బీరప్ప పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం ఇవ్వాలి

మిడ్జిల్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీఓ గీతాంజలి ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆమె పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. ఆమె వెంట ఎంపీఓ జగదీశ్వర్, తదితరులున్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

దేవరకద్ర: సైబర్ మోసాలపై అందరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ నాగన్న అన్నారు. గురువారం దేవరకద్రలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు ఫోన్‌లు చేసి మాయ మాటల చెప్పి ఆశ చూపిస్తారన్నారు. అలాంటి వారికి ఫోన్ నంబర్లు, ఓటీపీలు, బ్యాంకు ఖాతా నంబర్లు చెప్పరాదని సూచించారు.

ఫీజు చెల్లింపు తేదీని పొడిగించాలి



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: డిగ్రీ పరీక్ష ఫీజు తేదీ నేటితో ముగియనుండగా మరింత సమయాన్ని ఇవ్వాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో గురువారం కంట్రోలర్ రాజ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పవన్‌కుమార్ మాట్లాడుతూ పరీక్ష ఫీజులు ఇంకా చాలా మంది విద్యార్థులు చెల్లించలేదని, మరో పది రోజులు తేదీ పొడిగిస్తే విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. వెంకటేష్, శ్రీకాంత్, రాజు, గణేష్ పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్



స్టేషన్ మహబూబ్‌నగర్: రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలున్న వారికి ఇచ్చే ఇఫ్తార్‌లు మత సామరస్యానికి ప్రతీకలుగా నిలుస్తున్నాయని మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం అధ్యక్షులు ఎండి.ఫయాజ్ గురువారం అల్మాస్ ఫంక్షన్‌హాల్‌లో ఇఫ్తార్ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో అన్ని పండుగలు సోదరభావంతో జరుపుకుంటారన్నారు. ఫయాజ్ అతిథులను సన్మానించారు. ఎస్.వినోద్‌కుమార్, బెక్కరి మధుసూదన్‌రెడ్డి, ఏపీ మిథున్‌రెడ్డి, సాయిబాబా, రాములుయాదవ్, మహ్మద్ అవేజ్ అహ్మద్, పీర్ సాధిక్, మహ్మద్ ఇమ్రాన్ పాల్గొన్నారు.

మూసాపేటలో ఇఫ్తార్

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని మసీదులో గురువారం రాత్రి కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు శెట్టిశేఖర్ అధ్వర్యంలో ఇఫ్తార్‌ను ఏర్పాటు చేశారు. ఉపవాస దీక్షలు ఉన్న ముస్లింలకు పండ్లను తినిపించి దీక్షలను విరమింపజేశారు.

'కేపీ లక్ష్మీదేవిపల్లి'తో రైతులకు న్యాయం

మహమ్మదాబాద్: కేపీలక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణంతో రైతులకు ఎంతో న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కేఎం నారాయణ అన్నారు. పాలమూరు ఎత్తిపోతల పథకంలో భాగంగా కేపీలక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణం కోసం బిల్లు ప్రవేశపెట్టినందుకు గాను కాంగ్రెస్ నాయకులు గురువారం సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ముకుందం, అనంతయ్యగుప్త, చంపాబాయి పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌పై దృష్టి సారించాలి

- తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు
- చెరువులు ఆక్రమణలు లేకుండా చూడాలి
- కలెక్టర్ విజయేందిర బోయి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

జడ్చర్ల టౌన్: ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, ఇరిగేషన్, వ్యవసాయ, మిషన్ భగీరథ, పంచాయతీ రాజ్, ఏపీఓలతో తాగునీటి సమస్య, విద్యుత్, పంటల పరిస్థితిపై ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా సమీక్షించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండలంలో ఇప్పటి వరకు తాగునీటి సమస్య లేదని, మల్లెబోయిన్‌పల్లిలో అదనపు పంప్‌సెట్ తాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా వారం రోజుల్లో పూర్తిచేయిస్తామన్నారు. మామిడికుంట, ఇతర చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ హద్దులు ఏర్పాటు చేయాలని, ఆక్రమణ లేకుండా చూడాలన్నారు. చెరువులు, కుంటలు ఆక్రమణలకు గురి కాకుండా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు తనిఖీలు చేసి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండలంలో వరిసాగు విస్తీర్ణం, భూగర్భజలాలు ఇంటి పంటలు ఎండిపోయిన వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఎండిన పంటల పరిశీలన

మండలంలోని పోచమ్మగడ్డతండాలో రైతు భీక్యాకు చెందిన ఎండిన పంటను కలెక్టర్ పరిశీలించారు. 3ఎకరాల్లో వరి పైరు వేయగా అతని పొలంలో భూగర్భజలాలు ఇంకిపోవటంతో అది ఎండిపోయిందని రైతు కలెక్టర్‌కు వివరించాడు. రైతులు ఉన్న నీటిని పొదుపుగా వాడుకోవాలని, పంటలు ఎండిపోకుండా వ్యవసాయాధికారులు వారికి సలహాలు, సూచనలు అందించాలని సూచించారు. తహసీల్దార్ నర్సింహారావు, ఎంపీడీఓ విజయ్‌కుమార్, ఎంపీఓ సరోజ, వ్యవసాయశాఖ ఏడి ఆంజనేయులు, వ్యవసాయాధికారి గోపినాథ్‌తో పాటు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

33 మందికి కారుణ్య నియామకాలు

- జూనియర్ అసిస్టెంట్లుగా పోస్టింగ్



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా పరిషత్ పరిధిలో కారుణ్య నియామకం ద్వారా గురువారం 33 మందికి నియామక పత్రాలు అందజేశారు. కొన్ని సంవత్సరాలుగా వెయిటింగ్‌లో ఉన్నవారికి ఏకకాలంలో ఇంత పెద్ద మొత్తంలో నియామకాలు అందజేయడం విశేషం. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో సీఎం నియామక పత్రాలు అందజేశారు. మొత్తం 46 మంది ఉద్యోగులు వెయిటింగ్‌లో ఉండగా 33 మందికి నియామకాలు చేపట్టినట్లు జెడ్పీ సీఈఓ వెంకట్‌రెడ్డి తెలిపారు. మిగతా వాళ్ల సర్టిఫికెట్లను సమర్పించని కారణంగా 13 మందికి నియామక పత్రాలు అందజేయలేదని, అన్ని సర్టిఫికెట్లను సమర్పించిన తరువాత వారికి కూడా నియామక పత్రాలు అందజేస్తామన్నారు. ఈ 33 మందికి కలెక్టర్ అనుమతితో కౌన్సిలింగ్ ద్వారా ఖాళీగా ఉన్న స్థానాల్లో జూనియర్ అసిస్టెంట్లుగా పోస్టింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. జెడ్పీ జనరల్ సెక్షన్ సూపరింటెండెంట్ విజయ్‌కుమార్, రవి పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని బాదేపల్లి బాబీస్ట్రీట్‌లో గురువారం మార్వాడీ సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని మార్కెట్ డైరెక్టర్ సునీల్ ప్రారంభించారు. గంజ్‌కు వచ్చే రైతులతోపాటు, కూరగాయల వ్యాపారులు, వివిధ వస్త దుకాణాలకు వచ్చేవారికి చలివేంద్రం దాహార్తి తీర్చనుంది. దశాబ్దకాలంకు పైగా మార్వాడి సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటుచేస్తున్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): విద్యార్థులు బాగా చదివి ఉత్తీర్ణులై ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని శ్రీకారం ఫౌండేషన్ అధ్యక్షుడు శశిబాబు అన్నారు. గురువారం ఆ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులకు ఎగ్జామ్ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు పరీక్షకు సంబంధించిన మెటీరియల్‌ను అందజేశామన్నారు. కార్యక్రమంలో అడ్వకేట్ మురళీధర్, పాఠశాల ప్రిన్సిపాల్ సురేఖ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జనాభాకు అనుగుణంగా నిధులు కేటాయించాలి

మహబూబ్‌నగర్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను సవరించి దళితుల జనాభాకు అనుగుణంగా నిధులు కేటాయించాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎం.కుర్మయ్య డిమాండ్ చేశారు. గురువారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో బస్టాండ్ దగ్గర ధర్నా నిర్వహించారు. కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లెల మాణిక్యంరాజు, నాయకులు మనోహర్, చంద్రకాంత్, భరత్, నందు, సురేష్ పాల్గొన్నారు.

బీసీ సంక్షేమానికి మంగళం

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): రాష్ట్రంలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బీసీ సంక్షేమానికి మంగళం పాడినట్లుగా ఉందని తెలంగాణ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మెట్టుకాడి శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీలను చిన్న చూపు చూసే బడ్జెట్ అని, బహుజనుల ఆశలపై నీళ్ల చల్లేలా చేసిందని పేర్కొన్నారు తక్షణమే బహుజన వర్గాలు, మేధావులు స్పందించాలని కోరారు.

బడ్జెట్‌లో బీసీలకు అన్యాయం

జడ్చర్ల టౌన్: బడ్జెట్ కేటాయింపులో బీసీలకు తీరని అన్యాయం జరిగిందని బీసీజాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్ ఆరోపించారు. గురువారం బీసీ జాగృతి సేన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మా ట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో 56 శాతంకుపైగా ఉన్న బీసీలకు కేవలం రూ.11,405 కోట్లు కేటాయించటం దగా చేయటమేనన్నారు. నిరంజన్, నర్సింహులు, శేఖర్, విజయ్‌కుమార్, గోపాల్ పాల్గొన్నారు.

పాఠశాల సమస్యలు పరిష్కరిస్తాం

అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్



కోయిల్‌కొండలో హాస్టల్‌ను తనిఖీ చేస్తున్న అదనపుకలెక్టర్ శివేంద్రప్రతాప్

కోయిల్‌కొండ: స్థానిక బీసీ గురుకుల పాఠశాలలో విద్యార్థుల సమస్యలు పరిష్కరిస్తామని అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ అన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలోని ఆచార్యాపూర్ గ్రామంలో సెరికల్చర్ ద్వారా సాగుచేస్తున్న మల్బరీ తోటలను పట్టుపురుగుల షెడ్డును పరిశీలించి వాటి గురించి తెలుసుకున్నారు. అనంతరం మండల కేంద్రంలోని బిసి గురుకుల పాఠశాల చేరుకొని పాఠశాల విద్యార్థులకు గల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సమస్యలు, భవన నిర్మాణంపై తగుచర్యలు తీసుకుంటామన్నారు. సాంఘిక సంక్షేమ బీసీ హాస్టల్‌ను పరిశీలించారు. గ్రామంలోని సివిల్ ఆసుపత్రికి చేరుకొని అక్కడి వైద్యుల వద్ద ఆసుపత్రి మందులు, వైద్య సేవలపై ఆరాతీశారు. అనంతరం హాస్టళ్లు, ఆస్పత్రుల వద్ద పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీఓ హరిశ్చంద్రారెడ్డి, ఎంఈఓ వెంకట్‌జీ, పంచాయతీ కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కన్వీనర్ ఇందిర



మాట్లాడుతున్న ఇందిర

నవాబుపేట: చట్టాలపై ప్రతిఒక్కరికి అవగాహన తప్పనిసరి అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కన్వీనర్ ఇందిర అన్నారు. గురువారం మండల కేంద్రంలో జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. రైతులకు వారి భూసమస్యలతో పాటు పంట బీమా తదిదర విషయాల్లో నష్టం జరిగితే కోర్టు ద్వారా న్యాయం పొందవర్చన్నారు. బాల్యవివాహాలు అరికట్టాల్సిన అవసరం ఉందన్నారు. వయోజనుల కోసం ప్రత్యేక చట్టాలు ఉన్నాయని, పిల్లలు తమను చూడటం లేదని వయోజనులు న్యాయం కోసం కోర్టుకు వస్తే నిర్లక్ష్యంగా ఉన్న వారి పిల్లలపై చట్టప్రకారం చర్యలు ఉంటాయని ఆమె వివరించారు. అవగాహనా రాహిత్యంతో కేసులు పెట్టుకున్న వారు లోక్‌అదాలత్ ద్వారా తమ కేసులను పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఏఎస్‌ఐ జనార్దన్, లీగల్ కౌన్సిల్ రామకృష్ణగౌడ్, లీగల్ అడ్వైజర్ చౌదరి వెంకటేశ్వరప్ప, పంచాయతీ అధికారి నరేష్, లక్ష్మయ్య ఉన్నారు.

'ఫోరం'ను బలోపేతం చేస్తాం



మాట్లాడుతున్న సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు జగపతిరావు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: సామాజిక సేవలను విస్తృతం చేస్తామని సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు జగపతిరావు అన్నారు. గురువారం స్థానిక పారిశ్రామికవాడలోని 'ఫోరం' కార్యాలయంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ ఫోరాన్ని మరింత బలోపేతం చేస్తామని, వచ్చే నెల 5న వార్షిక నివేదిక ప్రవేశపెట్టి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఉగాది పండుగ రోజు కవి సమ్మేళం నిర్వహించనున్నామన్నారు. జిల్లాలోని కవులు ఆరోజు వచ్చి తమ కవితలను వినిపించవచ్చన్నారు. ఫోరం నాయకులు నారాయణరావు, నాగభూషణం, సురేష్ బాబు, రాజసింహుడు, వినోద్‌కుమార్, కె.వి.అశోక్, జి.నాగభూషణం పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నిఘా పటిష్టం



మాట్లాడుతున్న మార్కెట్ చైర్‌పర్సన్ జ్యోతి

జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో సీసీ కెమెరాల ఏర్పాటుచేసి నిఘాను పటిష్ట పరుస్తామని మార్కెట్ చైర్‌పర్సన్ తంగెళ్ల జ్యోతి తెలిపారు. గురువారం మార్కెట్ కార్యాలయంలో పాలకమండలి సర్వ సభ్య సమావేశాన్ని నిర్వహించారు. మార్కెట్‌లో నెలకొన్న సమస్యలపై దృష్టి సారించాలని ఈ సందర్భంగా ఆమె సంబంధిత మార్కెట్ అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. సీసీ కెమెరాల ఏర్పాటు ఎస్ఎల్‌జీ సెక్యూరిటి కంపెనీకి వర్క్ ఆర్డర్ ఇస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సభ్యులు ఆమోదం పలికారు. రైతులకు ఎక్కడా ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. అనంతరం యార్డు ఆవరణలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. రాజేందర్‌గౌడ్, సత్యం, కృష్ణయ్య, ఖాజపాష, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

దేవాలయ హుండీ లెక్కింపు



హుండీని లెక్కిస్తున్న సిబ్బంది

దేవరకద్ర: మండల కేంద్రంలోని ప్రసిద్ధి చెందిన ఈశ్వర వీరప్పయ్యస్వామి దేవాలయంలో గురువారం హుండిని లెక్కించారు. ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ వాసు, ఈఓ పెరుమాళ్ల కోమాలు, దేవస్థాన కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి సమక్షంలో హుండీని తెరిచారు. హుండీ ద్వార మొత్తం రూ. 1,86,908 ఆదాయం వచ్చింది. ఈఆదాయాన్ని బ్యాంకులో జమ చేశారు. త్వరలో సప్తాహ మహోత్సవాలు ప్రారంభం కానుండడంతో ముందస్తుగా హుండీని లెక్కించారు. ధర్మకర్తలు వెంకటయ్య, లక్ష్మమ్మ, బీరప్ప, రాఘవేంద్ర, ఉసేనయ్య పాల్గొన్నారు.

ముమ్మరంగా సీసీ రోడ్డు పనులు

స్థానిక ఈశ్వర వీరప్పయ్యస్వామి దేవాలయాల సముదాయం ఆవరణలో సీసీ రోడ్డు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఉగాది పండుగ తరువాత వారంరోజుల పాటు సప్తాహ మహోత్సవాలు జరుగనుండడంతో దేవాలయాన్ని ముస్తాబు చేస్తున్నారు. ఇప్పటికే దేవాలయానికి వచ్చిన విరాళాలలతో దేవాలయాల గోపురాలను పునర్నిర్మాణం పనులు పూర్తిచేశారు. దేవాలయంలో చలువ రాతి బండలను వేసి ఆధునీకరించారు.

ఆటో డ్రైవర్ నిజాయితీ

మహబూబ్‌నగర్ క్రైం: ఆటోలో ప్రయాణం చేసే ఓ మహిళా ప్రయాణికురాలు బ్యాగ్‌ను ఆటోలోనే వదిలేసి దిగిపోవడంతో గమనించిన డ్రైవర్ నిజాయితీతో బ్యాగ్‌ను టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించాడు. టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్ తెలిపిన వివరాలు.. న్యూమోతీనగర్‌కు చెందిన ఓ మహిళ గురువారం ఉదయం మోతీనగర్ నుంచి బస్టాండ్ వరకు ఆటోలో వచ్చింది. బస్టాండ్ దగ్గర దిగిన తర్వాత తనతో పాటు తెచ్చుకున్న హ్యాండ్‌బ్యాగ్ ఆటోలోనే వదిలేసిపోయిన విషయాన్ని డ్రైవర్ పరశురామ్ గమనించి బ్యాగ్‌ను టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు. సదరు మహిళను గుర్తించి బ్యాగ్‌తో పాటు మూడు తులాల బంగారం, వెండి వస్తువులను తిరిగి ఆమెకు అప్పగించారు.

ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి



రేకుల షెడ్డు నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

చిన్నచింతకుంట: కురుమూర్తి స్వామి ఆలయాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని అమ్మాపురం కురుమూర్తి స్వామి ఆలయం రాజగోపురం ముందు రేకులషెడ్డు నిర్మాణం చేపట్టేందుకు అధికారులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కురుమూర్తి స్వామి ఆలయ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి కోట్ల రూపాయల నిధులు మంజూరు చేశారన్నారు. ముఖ్యంగా రూ.110 కోట్ల నిధులతో ఎలివేటెడ్ కారిడార్ ఘాట్ రోడ్డు నిర్మాణం, రూ. 36లక్షలతో మంచి నీటి వాటర్ ట్యాంకు సంపును ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అంతకు ముందు దమగ్నాపూరం గ్రామంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట నాయకుడు అరవింద్‌కుమార్‌రెడ్డి, ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, దేవరకద్ర నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు ఎస్ వెంకటేష్, రాఘవేందర్‌రెడ్డి, నాయకులు వట్టం శివ, రామోహన్‌రెడ్డి, మైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సప్తమదశ బ్రహ్మోత్సవాలు



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం జెడ్పీ కార్యాలయం సమీపంలోని శ్రీద్వారకామాయి బాబా మందిరంలో సప్తమదశ వార్షిక బ్రహ్మోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఏకాదశ రుద్ర పారాయణంతో అష్టోత్త శతక్షీర కుంభాభిషేకం, పుష్పార్చన, మహా మంగళహారతి, పల్లకీసేవ ఊరేగింపు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ బిల్లు సాహసోపేత నిర్ణయం

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి



బొక్కలోనిపల్లి చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ అసెంబ్లీలో బీసీ డిక్లరేషన్‌ను ఆమోదించడం సాహసోపేత నిర్ణయమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని బొక్కలోనిపల్లి గ్రామ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లుగా బీఆర్‌ఎస్ కేవలం బీసీలు, ఎస్సీలను మాయ మాటలతో మభ్యపెట్టిందని విమర్శించారు. షఫి, శరత్‌కుమార్‌రెడ్డి, లలితమ్మ, రాంచందర్, నారాయణ, ఎస్‌టీగౌడ్, రాములు, బుచ్చన్నగౌడ్ తదితరులు ఉన్నారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్లు హర్షణీయం

అడ్డాకుల: బీసీలకు 42శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ శాసనసభలో బిల్లును ఆమోదించడం హర్షణీయమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మూసాపేట, అడ్డాకుల మండల కేంద్రాల్లో వారు సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షులు శెట్టిశేఖర్, శ్రీహరి, విజయమోహన్‌రెడ్డి, నిరంజన్, బగ్గి కృష్ణయ్య, సీజీ.గోవర్ధన్, సయ్యద్

కాంగ్రెస్ నాయకుల సంబరాలు

హన్వాడ: మండల కేంద్రంలో గురువారం కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. అసెంబ్లీలో బీసీ బిల్లు ప్రవేశపెట్టి బీసీలకు రిజర్వేషన్లు పెంచడం, ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలపడంపై కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. ఈసందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ప్రధానరహదారిపై బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు.

రజకులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి



మాట్లాడుతున్న నేషనల్ దోబీ రిజర్వేషన్ సంఘ్ జాతీయ కన్వీనర్ శ్రీనివాస్

మహబూబ్‌నగర్ రూరల్: రజకులను ఎస్సీ జాబితాలో చేరుస్తామని ఆయా పార్టీల నాయకులు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని నేషనల్ దోబీ రిజర్వేషన్ సంఘ్ జాతీయ కన్వీనర్ శ్రీనివాస్ అన్నారు. గురువారం స్థానిక బుద్ధ భవన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ రిజర్వేషన్‌ను 42 శాతం అమలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. దేశవ్యాప్తంగా ఒకే వృత్తి చేస్తున్న ఏకైక కులం దోబీలు, అలాంటప్పుడు భిన్న రిజర్వేషన్లు ఉండటంతో ఆర్థిక, రాజకీయ, సామాజిక అసమానతల తలెత్తుతాయని, అది దోబీ కులానికే చాలా ప్రమాదకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ జాబితాలో చేరేందుకు అన్ని విధాలుగా రజకులు అర్హులేనని, దేశ, రాష్ట్ర ప్రధాన పార్టీలు, ఎస్సీ కుల సంఘాలు అనుకూలంగా ఉన్నాయని గుర్తుచేశారు. అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి తక్షణమే పంపాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. నేషనల్ దోబీ రిజర్వేషన్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు గోపి, ఉమ్మడి జిల్లా గౌరవ అధ్యక్షుడు శివన్న, రజక రిజర్వేషన్ సమితి యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు శివకుమార్, మనోహర్ పాల్గొన్నారు.

నేడు మహాజన సభ

దేవరకద్ర: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మహాజన సభ నిర్వహిస్తున్నట్లు సింగిల్‌విండో చైర్మన్ నరేందర్‌రెడ్డి, సీఈఓ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. కోయిల్ సాగర్ రోడ్డులోని సహకార సంఘ భవనంలో ఉదయం 11 గంటలకు సభ ప్రారంభం అవుతుందని, బడ్జెట్ ఆమోదంతో పాటు రుణాలపై చర్చ ఉంటుందని పేర్కొన్నారు. సొసైటీలో సభ్యత్వం ఉన్న రైతులు, డైరెక్టర్లు అందరూ హాజరుకావాలని కోరారు.

స్థలం విషయంలో గొడవ

- పలువురిపై కేసునమోదు

నవాబుపేట: స్థలం విషయంలో జరిగిన గొడవలో పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో శ్రీరాములు అనే వ్యక్తికి చెందిన భూమిలో ఇంటి నిర్మాణ పనులు చేపడుతున్నాడు. మల్లేషయాదవ్ అనే వ్యక్తి మరి కొంతమందితో కలిసి పలుగు, పారలతో వచ్చి స్థలాన్ని ఆక్రమించాలని ప్రయత్నించాడు. ఈస్థలంలో నిర్మాణ పనులు ఆపకపోతే పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకుంటానని మల్లేష్ బెదిరించాడు. బాధితుడు శ్రీరాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మల్లేష్‌తో పాటు అతడి వెంట వచ్చినవారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పరీక్ష ప్యాడ్లు పంపిణీ

చిన్నచింతకుంట: మండలంలోని అల్లీపురం గ్రామంలో పదో తరగతి విద్యార్థులకు కాంగ్రెస్ పార్టీ నాయకుడు లక్ష్మారెడ్డి పరీక్ష ప్యాడ్లను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలు బాగా రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఉన్నారు.

అర్హులకే కుల ధ్రువపత్రాలు జారీచేయాలి



జడ్చర్ల టౌన్: అర్హులైన ఎస్సీలకే కులధ్రువీకరణ పత్రాలు జారీచేయాలని కోరుతూ గురువారం మాదిగసంఘం నాయకులు తహసీల్దార్ నర్సింగ్‌రావుకు వినతిపత్రం సమర్పించారు. 2024 నవంబర్ 27న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలుచేయాలని, మతం మారిన వారికి ఎస్సీ ధ్రువపత్రాలు జారీచేయరాదని తహసీల్దార్‌కు విన్నవించారు. కొందరివల్ల అర్హులైన ఎస్సీలు తీరని అన్యాయానికి గురవుతున్నారని అన్నానరు. ఎవరైనా ఎస్సీ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకుంటే ఆర్‌ఐ ద్వారా విచారణ జరిపించాక జారీచేయాలని కోరారు. నాయకులు రాజీవ్, మహేష్, రాము, సాయికుమార్, సంజీవ, ప్రవీణ్, యాదయ్య ఉన్నారు.

మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలభిషేకం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీ ఇటీవలి ఆమోదం తెలిపిన నేపథ్యంలో వర్గీకరణ కోసం కృషి చేసిన మందకృష్ణ మాదిగ చిత్రపటానికి ఎంఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నాయకులు గురువారం పీయూలో పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా బీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కార్తీక్ మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా మందకృష్ణ నడిపిన ఉద్యమ ఫలితంగా నేడు ఎస్సీ వర్గీకరణ జరిగిందన్నారు. వర్గీకరణకు సహకరించిన అన్ని పార్టీలకు కృతజ్ఞాతలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు మాళవి, మాధురి మోహన్, వినోద్, సంఘం నాయకులు గణేష్, కమలాకర్, రాము, మమత, రూప, ప్రవళిక పాల్గొన్నారు.